సాక్షి సిద్దిపేట

శుక్రవారం। 3। నవంబర్। 2023



ప్రచార జోరు..
అందోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. నేతలు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమయ్యారు.
వివరాలు ||లో ▸



కేసీఆర్ పాలనలో...
కేసీఆర్ పాలనలో ప్రజలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు.
వివరాలు ||లో ▸



త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు
కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపాలని డీఆర్డీఓ జయదేవ్ ఆర్య ఆదేశించారు.
వివరాలు |||లో ▸

న్యూస్‌రీల్

నాచగిరి హుండీ ఆదాయం రూ.10,10,715



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వివిధ హుండీల సొమ్మును గురువారం లెక్కించారు. గడిచిన 65 రోజులలో భక్తులు వేసిన కానుకల ద్వారా రూ.10,10,715 ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎస్.అన్నపూర్ణ తెలిపారు. సహాయ కమిషనర్‌తోపాటు దేవాదాయ ధర్మాదాయశాఖ ఉమ్మడి మెదక్‌జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్ పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. వివిధ సేవాసమితిల సభ్యులు, ఆలయసిబ్బంది, భక్తులు సొమ్ము లెక్కింపులో పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గౌరారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సమన్వయ కమిటీ సభ్యులుగా భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి

గజ్వేల్: అసెంబ్లీ సెగ్మెంట్ బీఆర్‌ఎస్ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులుగా కార్పొరేషన్ మాజీ చైర్మన్లు మడుపు భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డిలను నియమించినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఇన్‌చార్జిలుగా ఇప్పటికే ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు బాధ్యతలు నిర్వహిస్తుండగా, సమన్వయ కమిటీ సభ్యులుగా భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డిలు పనిచేస్తారని తెలిపారు. అందరి సమన్వయంతో కేసీఆర్‌కు లక్ష ఓట్లకుపైగా మెజారిటీని సాధిస్తామని మంత్రి తెలిపారు.

ఈజీఎస్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సైంటిస్టులు

మద్దూరు (హుస్నాబాద్): దూల్మిట్ట మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈజీఎస్ పనుల పరిశీలన ముగిసింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉపాధి హామీలో చేపట్టిన పనులను పూర్తి స్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు రోజుల్లో సేకరించిన వివరాలను కేంద్ర బృందం అధికారులకు అందజేస్తామన్నారు. ఉపాధి హామీ పనుల తీరుపై వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇస్రో సైంటిస్టులు జోషి సాయి ప్రకాష్‌చౌదరి, సాలోమన్ రాజు, కుమార్, ఈసీ పరశురాములు, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి

సిద్దిపేటఅర్బన్: అవయవదానంతో మరొకరి ప్రాణం నిలుస్తుందని, అవయవ దానానికి ప్రజలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని సురభి వైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్లు అన్నారు. అవయవదానం ప్రాముఖ్యతపై గురువారం మిట్టపల్లిలోని సురభి మెడికల్ కళాశాల అనుబంధ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ నేత్ర అవయవ దాతల సంఘం అధ్యక్షుడు ఈశ్వర లింగం మాట్లాడుతూ లేనిపోని అపోహలు పెట్టుకోకుండా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గోదావరిఖనికి చెందిన సదాశయ ఫౌండేషన్, సూర్యాపేటకు చెందిన స్పందన సంస్థ, హైదరాబాద్‌కు చెందిన అమ్మ నేత్ర అవయవ శరీర దాతల సంఘం ప్రతినిధులు పాల్గొని అవగాహన కల్పించారు.

పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులు రావొద్దు



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

గజ్వేల్: పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఇఫ్తేకార్ నజీబ్ అన్నారు. గురువారం గజ్వేల్‌లోని పలు జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్ల తీరును పరిశీలించారు. తరుగు పేరుతో కోత విధించవద్దని జిన్నిగ్ మిల్లుల యజమానులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ ధర విషయమై రైతులను అడగ్గా క్వింటాలుకు రూ.7,120 చెల్లిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఏడీఎం మనోహర్, స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు ఉన్నారు.





యాగం.. నిర్విఘ్నం
సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో రాజశ్యామల సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగం రెండో రోజైన గురువారం అత్యంత వైభవంగా కొనసాగింది. యాగంలో కేసీఆర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. – మర్కూక్ (గజ్వేల్)

నామినేషన్లకు వేళాయె..

నేటి నుంచే స్వీకరణ
- ఈ నెల 10 వరకు గడువు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 9న కోనాయిపల్లికి సీఎం కేసీఆర్ రాక

సాక్షి, సిద్దిపేట: అసెంబ్లీ ఎన్నికల ప్రధాన ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. తొలుత నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకోసం నియోజకవర్గ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు.

ఆర్‌ఓలు వీరే..
సిద్దిపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీఓ రమేశ్ బాబు, దుబ్బాక ఆర్‌ఓగా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, హుస్నాబాద్‌కు బెన్‌షాలం, గజ్వేల్‌కు బన్సీలాల్‌లను నియమించారు. వీరు ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులనుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందు కోసం ఆర్‌ఓ కార్యాలయాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ర్యాలీగా వచ్చిన అభ్యర్థులను 100 మీటర్ల దూరంలోనే నిలిపివేసి మూడు వాహనాలనే కార్యాలయ ప్రాంగణంలోకి అనుమతించనున్నారు.

9న కేసీఆర్, హరీశ్ పూజలు
ఈ నెల 9న నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి దేవాయలంలో బీఆర్‌ఎస్ అధినేత సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం నామినేషన్ల పత్రాలపై సంతకాలు పెట్టి గజ్వేల్‌లో కేసీఆర్, సిద్దిపేటలో హరీశ్‌రావులు నామినేషన్లు దాఖలు చేయన్నారు.



వివిధ రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

ఖరారు కానీ సిద్దిపేట, హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థులు
ఓ పక్క నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతున్న సైతం బీజేపీ నుంచి సిద్దిపేట, హుస్నాబాద్ అభ్యర్థులను ఇప్పటికీ ప్రకటించలేదు. దీంతో ఎన్నికల ప్రచార సమయం సరిపోదని కార్యకర్తలు వాపోతున్నారు. త్వరగా అభ్యర్థులను ప్రకటిస్తే ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంటుందని అంటున్నారు. అందరి కంటే ముందుగా బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించి బీ ఫారాలు సైతం అందించారు. రెండు విడతల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించారు. సీపీఐ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ అభ్యర్థులను ప్రకటించలేదు.

పోలీసు అబ్జర్వర్స్ నియామకం
సిద్దిపేటకమాన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు అబ్జర్వర్స్‌ను నియమించారు. ఐపీఎస్ అధికారి సోనమ్ టెన్జింగ్ భూటియాను జనరల్ అబ్జర్వర్‌గా, సిద్దిపేట, హుస్నాబాద్‌కు ఐఏఎస్ అధికారి జయశ్రీ, గజ్వేల్, దుబ్బాకకు ఐఏఎస్ అధికారి మన్‌మోహన్ ప్రసాద్‌ను నియమించారు.

అనుమతులు తప్పనిసరి

సిద్దిపేటరూరల్: ఎన్నికల్లో భాగంగా రాజకీయ పార్టీలు నిర్వహించే వారి వారి కార్యకలాపాలకు ముందస్తు అనుమతి తీసుకావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాకలో 3, గజ్వేల్‌లో 10 పోలింగ్ స్టేషన్ల పేర్లలో మార్పుల గురించి పార్టీ సభ్యులతో చర్చించారు. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ఓటర్ లిస్ట్ ను త్వరలో అందిస్తామన్నారు. సమావేశంలో దుబ్బాక, హుస్నాబాద్ ఆర్వోలు గరీమా అగ్రవాల్, బెన్ షాలం, పొలిటికల్ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కు మరవొద్దు..
ఎవరికీ వెరవొద్దు

ప్రలోభాలకు గురిచేస్తే 'విజిల్' వేయండి



- వంద నిమిషాల్లో చర్యలు తీసుకుంటాం
- 85 శాతానికి మించి పోలింగ్ పెంచేందుకు కృషి
- 80 ఏళ్ల వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం
- నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో సహా ఐదుగురికే అనుమతి
- 'సాక్షి'తో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

'ఎన్నికల నిబంధనలు పాటిస్తూ పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి. వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో సహా ఐదుగురే లోపలికి అనుమతి ఇస్తాం' అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్ల పై జిల్లా ఎన్నికల అధికారిని గురువారం 'సాక్షి' పలకరించింది. వివరాలు ఆయన మాటల్లోనే..

సాక్షి, సిద్దిపేట: గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సగటున 84శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా సగటున 11శాతం అధికంగానే జిల్లాలో నమోదు అవుతోంది. ఈ సారి 85 శాతం కంటే ఎక్కువ పోలింగ్ నమోదు అయ్యేలా కృషి చేస్తాం. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నాం. కొత్తగా నమోదు చేసుకున్న 42వేల మందికి కొత్త ఎపిక్ కార్డులను అందజేశాం.

సీ– విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయండి
డబ్బు, మద్యంతో పాటు ఇతర ప్రలోభాలకు గురికుండా ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటర్లకు మొబైల్, చీరలు, ఇంటి అవసరాలకు వస్తువులు, డబ్బులు అందజేస్తున్నట్లు తెలిస్తే సీ విజిల్ యాప్‌లో లైవ్ ఫొటో, వీడియో తీసి పెడితే 100 నిముషాల లోపు అక్కడికి చేరుకుని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో 3 చొప్పున ఫ్లయింగ్, మోడల్ కోడ్ కండక్ట్, స్టాటికల్ సర్వేలెన్స్ టీంలు నిత్యం పర్యవేక్షిస్తున్నాయి. 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాం. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌లో 40శాతం కంటే ఎక్కువ ఉన్న వారు, వయోవృద్ధులు 12డీ ఫారంను నింపి ఈ నెల 8 లోగా ఆర్‌ఓకు అందించాలి. దరఖాస్తును పరిశీలించి ఓటు వేసే అవకాశం కల్పిస్తాం. అలాగే పోలింగ్ కేంద్రానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, చంటి పిల్లలున్న బాలింతలకు నేరుగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాం. వీల్ చైర్ కావాలంటే ఏర్పాటు చేస్తాం.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు
ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశాం. శుక్రవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. నామినేషన్లను వేసేందుకు వచ్చే వారు ఆర్‌ఓ కార్యాలయంకు 100 మీటర్లలోపు 3 వాహనాలే అనుమతిని ఇవ్వడం జరుగుతుంది. అలాగే నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో సహా ఐదుగురినే లోపలికి అనుమతిస్తాం. ఫారం–26లో అభ్యర్థి ఆస్తుల వివరాలను పొందురుస్తారు. వాటిని వెంటనే ఆర్‌ఓ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ప్రదర్శన, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుంది. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తాం.

1,151 పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్‌లో 1,151 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు 5వేల మంది సిబ్బందిని నియమించాం. వీరికి ఇప్పటికే మొదటి దశ శిక్షణ పూర్తి అయింది. రెండో దశ ఈ నెల 20 నుంచి 23వతేదీ లోపల శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను పరిశీలించాం. బందోబస్తు దృష్ట్యా జిల్లాకు కేంద్ర బలగాలు ఇప్పటి వరకు మూడు కంపెనీలు వచ్చాయి.

రూ.4.88 లక్షల పట్టివేత

మిరుదొడ్డి(దుబ్బాక): వేర్వేరు చెక్ పోస్టుల వద్ద గురువారం రూ.4.88 లక్షల నగదును పట్టుకుని పోలీసులు సీజ్ చేశారు. మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాల చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేశారు. జంగపల్లికి చెందిన నర్సింహులు ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా రూ.3.49 లక్షల నగదు గుర్తించారు. సంబంధించి ఆధారాలు లేక పోవడంతో డబ్బును సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ మల్లేశం, మిరుదొడ్డి ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ... ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా డబ్బులను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అయినాపూర్ చెక్‌పోస్ట్ వద్ద..
కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.2.39లక్షల నగదు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినాపూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో రెండు వేర్వేరు కార్లలో రూ.2 లక్షల 39 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



మిరుదొడ్డి: నగదును పట్టుకున్న అధికారులు

కొండముచ్చును బోనులో బంధించారని..

సిద్దిపేటకమాన్: కోతులను తరమడానికి తీసుకువచ్చిన ఓ కొండముచ్చును గొలుసులతో బంధించి ఉంచడాన్ని గుర్తించిన స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. సిద్దిపేట పట్టణానికి చెందిన జంతు ప్రేమికులు.. బంధించిన కొండముచ్చును గమనించి స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి గౌతమ్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే సిద్దిపేట అటవీశాఖ అధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. అటవీశాఖ అధికారి ఇక్రామొద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని కొండముచ్చును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై విచారణ జరిపి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మా ఊరిలో అభివృద్ధి ఏదీ?

బీఆర్‌ఎస్ నేతల ప్రచారాన్ని అడ్డుకున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): మండల పరిధి బందారం గ్రామంలో బీఆర్‌ఎస్ నేతల ప్రచారాన్ని మహిళలు అడ్డుకున్నారు. ప్రచారంలో భాగంగా గురువారం గ్రామంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతుండగా మా ఊరికి ఏమీ చేయలేదంటూ మహిళలు ఒక్కసారిగా ప్రసంగాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి వచ్చేందుకు రోడ్డు సరిగా లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. అన్ని గ్రామాల్లో చెరువులను గోదావరి జలాలతో నింపుతున్నారని, మా గ్రామం చెరువును విస్మరించారన్నారు. ఎవరికీ డబుల్ బెడ్రూం నిర్మాణాలు జరగలేదని నాయకులను నిలదీశారు. అడ్డుకున్న మహిళను తోసుకుంటూ వెళ్లడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీంతో ప్రచారాన్ని సగంలో ఆపేసి వెళ్లిపోయారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, బీఆర్‌ఎస్ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ నేతలతో మహిళల వాగ్వాదం

భూ సమస్యలు పరిష్కరిస్తేనే ఓటు వేస్తాం



పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తుల ఆందోళన

కపూర్‌నాయక్‌తండా వాసుల నిరసన

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ సమస్యలు పరిష్కరిస్తేనే ఓటు వేస్తామని, లేదంటే బహిష్కరించి తీరుతామంటూ మండలంలోని కపూర్‌నాయక్‌తండా వాసులు స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం వారు పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా తండా సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్, గ్రామస్తులు మాట్లాడుతూ తాతముత్తాతల నుంచి సాగుచేసుకుంటున్న భూములు రిజిస్ట్రేషన్లు కావట్లేదని, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం శారు. అనేకమార్లు అధికారుల వెంట, స్థానిక ప్రజాప్రతినిధుల ఎదుట మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ధరణి పోర్టల్‌లో సీలింగ్ భూమి కింద నమోదు కావడంతో ప్రస్తుతం విరాసత్ సైతం కావడం లేదని వాపోయారు. ఏళ్లతరబడి వెంటాండతున్న భూసమస్యను పరిష్కరిస్తే తప్ప తాము ఓటు హక్కును వినియోగించుకోమని స్పష్టం చేశారు.

మేము సైతం బహిష్కరిస్తాం
గజ్వేల్‌రూరల్: ధరణిలో దొర్లిన తప్పుల కారణంగా మా పట్టా భూములు మార్చబడ్డాయని, ఈ సమస్య పరిష్కరించక పోతే ఎన్నికలను బహిష్కరిస్తామని మండల పరిధిలోని రంగంపేటకు చెందిన బాధిత రైతులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ సర్వే నంబర్ 257లో 513 ఎకరాలకు గాను 196 ఎకరాలు సీలింగ్ భూమిగా ఉండేవని, ధరణి కారణంగా మా పట్టా భూములన్నీ సీలింగ్ భూములుగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పలు మార్లు మంత్రి హరీశ్ రావుతో పాటు, తహశీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తెచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆదినుంచి రసవత్తర రాజకీయాలే..

రిజర్వుడు స్థానంలో 'కింగ్ మేకర్'లదే హవా
- నేడు సెంటిమెంట్‌గా మారిన నియోజకవర్గం
- గజ్వేల్ అసెంబ్లీ సెగ్మెంట్ అవలోకనం

గజ్వేల్: రాజకీయాల్లో ఆది నుంచి చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. 2009కు పూర్వం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా ఉన్న ఈ సెగ్మెంట్‌లో 'కింగ్ మేకర్'లదే హవా కొనసాగేది. ఎవరి గెలిపించాలన్నా, ఎవరిని పక్కకు తప్పించాలన్నా వారిదే నిర్ణయం. వారి కనసన్నల్లోనే రాజకీయాలు నడిచేవి. కానీ 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఈ స్థానం 'జనరల్'గా ఆవిర్భవించడంతో రాజకీయాల తీరు మారింది. స్వయం ప్రతిపత్తి రాజకీయాలకు బాటలు పడ్డాయి.

1952లో శాసన సభా నియోజకవర్గంగా ఆవిర్భవించిన గజ్వేల్ 1962 నుంచి 2004వరకు ఎస్సీ రిజర్వుడ్‌గా ఉంది.1957లో గజ్వేల్ ద్విసభ్య నియోజకవర్గంగా ఉండగా ఆ సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఆర్.నర్సింహారెడ్డి, జేబీ ముత్యాలరావు గెలుపొందారు. 1962లో ఈ స్థానాన్ని ఎస్సీలకు రిజర్వు చేశారు. అప్పట్లో కాంగ్రెస్‌లో ఆధిపత్యం కొనసాగిస్తున్న ఓ నేత గజ్వేల్ సైదయ్యను ఎమ్మెల్యేగా బరిలోకి దింపి నుంచి 1978వరకు ఆయను నాలుగు సార్లు గెలిపించారు. 1983, 1985, 1994, 1999 సంవత్సరాల్లో ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేలు గెలుపొందగా...ఆ పార్టీలో 'కింగ్ మేకర్'గా పేరున్న నేత వారిని గెలిపించారు. స్థానికేతరులను బరిలో దింపి మరీ గెలిపించారు. తిరిగి 1989, 2004లో గెలుపొందిన డాక్టర్ జె.గీతారెడ్డి ఆ రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేశారు. తనపై అధిపత్యాన్ని చెలాయించడానికి ప్రయత్నించిన సీనియర్లకు చెక్ పెట్టారు. 2009లో ఈ స్థానం జనరల్‌గా మారిన తర్వాత కాంగ్రెస్‌కు చెందిన స్థానిక నేత తూంకుంట నర్సారెడ్డి ఎమెల్యేగా గెలుపొందారు. 2014 తర్వాత ఇక ఈ నియోజకవర్గం కేసీఆర్ ఇలాఖాగా మారిపోయింది. ఈ నియోజకవర్గాన్ని సెంటిమెంట్‌గా ఎంచుకున్న గులాబీ బాస్ కేసీఆర్ అనుకున్న విధంగానే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దారు.

స్థానికేతర ఎమ్మెల్యేలు వీరే...

1952లో ఎమ్మెల్యేగా గెలిచిన పెండెం వాసుదేవ్, 1957లో జేబీ ముత్యాలరావు, ఆర్. నర్సింహ్మారెడ్డి, 1983లో అల్లం సాయిలు, 1985లో సంజీవరావు, 1989, 2004లలో డాక్టర్ జే.గీతారెడ్డి, 1994లో డాక్టర్ జి.వి జయరామారావు, 1999లో సంజీవరావులు స్థానికేతరులే. స్థానిక నాయకత్వం బలంగా లేదనే కారణంతో గజ్వేల్‌లో కాంగ్రెస్, టీడీపీ రాజకీయాలను శాసించిన ఇక్కడి నేతలు స్థానికేతర నాయకులను 'బరి'లోకి దింపి గెలిపించారు.



క్లుప్తంగా

యువతను మోసగించిన సర్కార్



పార్టీలో చేరిన యువకులతో రాజిరెడ్డి

నర్సాపూర్: యువకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని ఆ పార్టీ నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం ఆయన సమక్షంలో మాసాయిపేటకు చెందిన పలువురు యువకులు హస్తం పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువకులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసినందున తమ పార్టీలో చేరుతున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, ఇతర నాయకులు నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



కండువాలు కప్పుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని లింగాపూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూపాల్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పరమేశ్వర్, సత్యపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, సతీష్, హన్మాండ్లు, మాణిక్యం, వడ్ల అంజయ్య, నార లక్ష్మణ్, వెంగప్ప, నారప్ప, వీర్న, తుకారాం, సాయిలు, నర్సింహులు, రాములు, విఠల్, వెంకయ్య, షకీల్, షాదుల్, గంజాయిరాజు, నర్సమ్మ, వడ్డె రాజు, యాదుల్ పాల్గొన్నారు.

అవినీతిమయంగా బీఆర్ఎస్, కాంగ్రెస్

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



బీజేపీలో చేరిన గుడికందుల గ్రామ యువకులు

తొగుట(దుబ్బాక): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవినీతిమయంగా మారాయని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ఆరోపించారు. మండలంలోని గుడికందుల గ్రామానికి చెందిన యువకులు గురువారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని తెలిపారు. తన గెలుపు కోసం యువత సైనికుల్లా కష్టపడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.



బజ్జీలు తింటూ మహిళతో మాట్లాడుతున్న మురళీ యాదవ్

ఓటేస్తే.. గుడిసెను మిద్దె చేస్త

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సీతారాం తండాలో నర్సాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీ యాదవ్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికంగా బజ్జీలు వేస్తున్న గిరిజన మహిళ వద్దకు వెళ్లి బజ్జీలు తీసుకుని తిన్నారు. గుడిసెలో ఉంటున్న ఆమెను చూసి.. ఇంకెన్నాళ్లు ఇందులో ఉంటావు, బీజేపీకి ఓటు వేస్తే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మిద్దె కట్టిస్తానని హామీ ఇచ్చారు.



యువకుడికి కటింగ్ చేస్తున్న బీఎంపీ అభ్యర్థి ప్రకాష్ రాథోడ్

కటింగ్ చేస్తా.. ఓటేస్తావా తమ్మీ

నారాయణఖేడ్: బీఎంపీ అభ్యర్థి ప్రకాష్ రాథోడ్ వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని హంగిర్గా(బి) గ్రామంతోపాటు, గిరిజన తండాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా హంగిర్గా(బి)లోని ఓ కటింగ్ షాపులో యువకుడికి కటింగ్ చేస్తూ తనకే ఓటేయాలి తమ్మీ అంటూ.. ప్రకాష్ కోరారు. కార్యక్రమంలో సురేష్, వినోద్, రవి, రాజు, శ్రీనివాస్, శివాజీ ఉన్నారు.



సునీత రెడ్డితో మాట్లాడుతున్న వృద్ధురాలు

అవ్వతో హామీ తీసుకుంటూ..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కొంగోడ్ గ్రామంలో బీఆర్ఎస్ నర్సాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతరెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లింది. ఆమె సునీత రెడ్డిని దగ్గరకు తీసుకుని చెవిలో గుసగుసలాడింది. నా ఓటు నీకే వేస్త.. ఏం ఫికర్ చేయకు అని చెప్పినట్లు కనిపించింది.

ప్రచార జోరు

స్పీడు పెంచిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు

● ఇంకా ప్రారంభించని బీజేపీ ● చాపకింద నీరులా బీఎస్పీ





జోగిపేట (అందోల్): అందోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించే పనిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నిమగ్నమయ్యాయి. ఆ పార్టీల అభ్యర్థులు క్రాంతికిరణ్, దామోదర రాజనర్సింహ స్వయంగా ప్రచారాన్ని చేపడుతున్నారు. నియోజకవర్గంలో అందోల్, పుల్కల్, అల్లాదుర్గం, రేగోడ్, చౌటకూరు, వట్‌పల్లి, టేక్మాల్, మునిపల్లి, రాయికోడ్ మండలాలున్నాయి. అందోల్, చౌటకూరు, వట్‌పల్లి మండలాల్లో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టగా, టేక్మాల్, రాయికోడ్ మండలాల్లో క్రాంతికిరణ్ ప్రచారాన్ని ప్రారంభించారు. ఊరికి ఇద్దరు కాంగ్రెస్ ముఖ్య నాయకులు అందోల్ మండలంలో ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. గ్రామాల్లో అభ్యర్థులకు ప్రజలు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలుకుతున్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. కరపత్రాలను పంచిపెడుతున్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఇరు పార్టీలు కూడా యువతపైనే దృష్టిపెట్టారు.

మేనిఫెస్టోల పైనే ఆశలు

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రకటించిన మేనిఫెస్టోలపైనే పార్టీ అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. ఇరు పార్టీలు కూడా లక్షల సంఖ్యలో మేనిఫెస్టో కరపత్రాలను ముద్రించి ఇంటింటికీ పంచిపెడుతున్నారు. వాటి గురించి ప్రజలకు వివరిస్తున్నారు. క్రాంతికిరణ్ కరపత్రాలను పంపిణీ చేస్తూ వృద్ధులు, మహిళలతో ఫొటోలు దిగుతున్నారు. దామోదర ఈ సారి ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని చేస్తున్నారు. అనంతరం మహిళలు, రైతులు, యువకులను ఒకచోట కూర్చోబెట్టి ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని మాట తీసుకుంటున్నారు.

ఇంకా మొదలు పెట్టని బీజేపీ

నియోజకవర్గంలో బీజేపీ ఇంకా ప్రచారానికి శ్రీకారం చుట్టలేదు. గురువారం బాబుమోహన్‌ను అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించింది. అయితే తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయనని గతంలోనే బాబుమోహన్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. అయినా ఆయనకే టికెట్ ఇవ్వడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అందోల్ టికెట్‌ను బాబూమోహన్ తనయుడు ఉదయ్‌భాస్కర్, మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్యలు ఆశించారు. కానీ బాబుమోహన్ టికెట్ ఇచ్చారు. దీనికి సమ్మతించి బరిలో ఉంటారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రచారంలో బీజేపీ వెనుకబడటంతో ఆ పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఏది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది.

స్థానిక నినాదంతో..

నియోజకవర్గంలో బహుజన సమాజ్‌పార్టీ అభ్యర్థిగా ముప్పారం ప్రకాశం పోటీలో ఉన్నారు. ఆ పార్టీ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అందరి కంటే ముందే అభ్యర్థిని ప్రకటించారు. దీంతో ప్రకాశం ముందస్తుగా ప్రచారాన్ని ప్రారంభించారు. తానే అసలైన స్థానికుడినని, నియోజకవర్గంలోనే పుట్టి పెరిగి చదువుకున్నానని ప్రచారం చేసుకుంటున్నారు. స్థానిక నినాదాన్ని గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

కేసీఆర్ పాలనలో ఉజ్వల భవిష్యత్

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): కేసీఆర్ పాలనలో ప్రజలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో తురక కాశ కులస్తులు, రామన్నపల్లి గ్రామస్తులు మంత్రి హరీశ్‌రావుకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ సిద్దిపేటను రాష్ట్రంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన మంత్రి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్యక్షుడు పాపయ్య, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం, సర్పంచ్‌లు సుభాష్, ఉమేష్ చంద్ర, ఎంపీటీసీలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరిస్తే ఓటేస్తాం..



అంతాయిగూడలో మహిళలతో మాట్లాడుతున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కారు గుర్తుకే ఓటేస్తాం.. మా ఊరి భూ సమస్య పరిష్కరించాలని అంతాయిగూడ గ్రామస్తులు గురువారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాత భూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మునిగడప గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్, కొండపోచమ్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్, కావ్య, శ్రీనివాస్‌గౌడ్, సత్యం, బాలలక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే మళ్లీ కరువే

ఎఫ్‌డీసీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి



అంకిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రజల కష్టాలను దూరం చేసిన సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని అంకిరెడ్డిపల్లి, బందారం, దర్గా, రాంపల్లి, మర్పడ్గ, ఖమ్మంపల్లి, నాగిరెడ్డిపల్లి, సిర్సనగండ్ల, గిరాయిపల్లి గ్రామాల్లో కేసీఆర్ విజయం కోసం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే మునుపటి కరువు తప్పదన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతాంగం తీవ్ర ఇబ్బంది పడిందని తెలిపారు. కుల మతాలకతీతంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, జాగృతి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడి అనంతుల ప్రశాంత్, నూనె కుమార్, బడేకోలు లావణ్య, శ్రీనివాస్, రజిత, లత, సంజీవరెడ్డి, ఎంపీటీసీలు పత్తి ఆంజనేయులు, ర్యాగల్ల దుర్గయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ప్రతిపక్షాలకు దడ



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో పార్టీలో చేరికల కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ సీనియర్ నాయకుడు రాంభూపాల్ రెడ్డి తన అనుచరులతో కలిసి గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 60 ఏళ్లుగా తెలంగాణలో జరగని అభివృద్ధి కేసీఆర్ 10 ఏళ్లలో చేసి చూపించారని తెలిపారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలు డిపాజిట్‌ల కోసం పోరాటం చేయాలని సూచించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి వారికి దడ పుడుతుందన్నారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలో మైనార్టీలకు అన్యాయం

అల్లాదుర్గం(మెదక్): బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ జలీల్ అన్నారు. గురువారం అల్లాదుర్గంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ 9 ఏళ్లుగా పట్టించుకోవడం లేదన్నారు. మైనార్టీ కార్పొరేషన్ లోన్స్ గ్రామానికి ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. వైఎస్ఆర్ ప్రభుత్వం హయాంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించారని ఆయన చెప్పారు. కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యమవుతుందని తెలిపారు.

తప్పుడు ప్రచారాలు చేయొద్దు : సీపీ

సిద్దిపేటకమాన్: సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా తప్పుడు పోస్టులు చేయకూడదని సీపీ ఎన్.శ్వేత తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై ఐటీ చట్టం ప్రకారం 21 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి

జనగామ బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత రెడ్డి



అయినాపూర్‌లో మాట్లాడుతున్న దశమంత రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జనగామ బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత రెడ్డి అన్నారు. గురువారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుని మండలంలోని అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రాష్ట్రంలో కూడా ఉంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే జనగామ ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేష్, రాష్ట్ర నాయకుడు చక్రధర్, రాష్ట్ర మహిళ మోర్చా సభ్యురాలు తోకల ఉమారాణి, లక్ష్మారెడ్డి, దండ్యాల వెంకటరెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

ఎన్నికల కిట్‌లు వచ్చేశాయ్



2023 అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా అధికారులకు అందించే కిట్‌లు గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. జిల్లా సమీకృత కార్యాలయంలో వాటిని భద్రపరిచారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



మద్దూరులో ప్రచారం చేస్తున్న కొమ్మూరి అరుణ

మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సతీమణి అరుణ ధీమా వ్యక్తం చేశారు. గురువారం దూళ్మిట్ట, మద్దూరు మండలంలోని పలు గ్రామాల్లో జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుల మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో వారికి ఓట్లతో తగ్గిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానికుడైన ప్రతాప్‌రెడ్డికి పట్టం కట్టాలని.. మన ప్రాంతం కాని పల్లాకు ఓటమి రుచి చూపించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భద్రప్ప, రాములు, సత్తయ్య పాల్గొన్నారు.

రఘునందన్ రావుకు గుణపాఠం తప్పదు



కాంగ్రెస్‌లో చేరిన మహిళలతో చెరుకు శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాక: దుబ్బాకలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని 17వ వార్డు, మండల పరిధిలోని రాజక్కపేటకు చెందిన సుమారు 100మంది మహిళలు, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక అభివృద్ధి కేవలం దివంగత ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి హయాంలో మాత్రమే జరిగిందన్నారు. అమలుకు నోచని హామీలతో ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్ రావు దుబ్బాకకు చేసిందేమీ లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగుచెందారన్నారు. కార్యక్రమంలో రవి, యేసురెడ్డి తదితరులున్నారు.

జహీరాబాద్ బీజేపీ అభ్యర్థిగా రాంచందర్

ఢిల్లీ వసంత్‌కు నిరాశే

బయోడేటా

నియోజకవర్గం	:	జహీరాబాద్
పేరు	:	సి.రాంచందర్ రాజనర్సింహ
పుట్టినతేది	:	24-04-1969
విద్యార్హత	:	డిగ్రీ
తండ్రి	:	రాజనర్సింహ
తల్లి	:	జనాబాయి
భార్య	:	సుమిత్ర
కుమార్తెలు	:	స్నేహ, శ్రేయ

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ(ఎస్సీ) నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా రాంచందర్ రాజనర్సింహ పేరును గురువారం అధిష్టానం ప్రకటించింది. టికెట్ రేసులో సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ పేరు ముందున్నా చివరకు రాజనర్సింహ వైపే మొగ్గు చూపింది. అలాగే చింతలగట్టు సుధీర్‌కుమార్ సైతం టికెట్ ఆశించారు. మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహకు రాంచందర్ స్వయాన సోదరుడు. గతేడాది కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు.

ఖేడ్ అభ్యర్థిగా జన్‌వాడే సంగప్ప

బయోడేటా..

పేరు: జన్‌వాడే సంగప్ప, తండ్రి: కంటెప్ప, తల్లి: శాంతమ్మ

పుట్టిన తేదీ: 06-06-1976

జన్మస్థలం: గ్రామం చౌకాన్‌పల్లి

మండలం: కంగ్టి, జిల్లా సంగారెడ్డి

సామాజిక వర్గం: లింగాయత్ (బీసీ)

విద్యార్హత: 7వ తరగతి వరకు జెడ్పీ పాఠశాల కంగ్టి, 8 నుంచి 10వ తరగతి వరకు జెడ్పీహెచ్ఎస్ నిజాంపేట్, ఇంటర్మీడియెట్ వీఎస్ఎస్ జూనియర్ కళాశాల సిద్దిపేట, బీఏ ఉస్మానియా యూనివర్సిటీ, బీసీజే, ఎంసీజే కాకతీయ విశ్వవిద్యాలయం.

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా జన్‌వాడే సంగప్ప పేరును గురువారం అధిష్టానం ప్రకటించింది. పార్టీ అభ్యర్థిత్వం కోసం ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే ఎం.విజయపాల్‌రెడ్డి పోటీపడ్డారు. కంగ్టి మండలం చౌకాన్‌పల్లికి చెందిన సంగప్ప లింగాయత్ బీసీ కులానికి చెందినవారు. జర్నలిస్టుగా రెండు దశాబ్దాలపాటు మీడియా సంస్థల్లో పనిచేశారు. 2021 జనవరి 1న బండి సంజయ్ నేతృత్వంలో బీజేపీలో చేరారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పని చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోరాటం చేశారు.

అందోల్ అభ్యర్థిగా బాబుమోహన్

బయోడేటా

పేరు: పల్లి బాబుమోహన్

తల్లిదండ్రులు: ఆనంద్‌రావు, పేరమ్మ

స్వస్థలం: బీరోలు(ఖమ్మం)

స్థిర నివాసం: హైదరాబాద్

విద్యార్హత: డిగ్రీ

జననం: 14 ఏప్రిల్, 1948

పదవులు: 1998 (ఉప ఎన్నిక), 1999, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నిక. 1998, 99 టీడీపీ నుంచి గెలిచి కార్మిక శాఖ మంత్రిగా సేవలందించారు. 2014లో టీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నికయ్యారు. 2018లో బీజేపీలో చేరారు.

వృత్తి: సినీ నటుడు, రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా సేవలు

కుమారుడు: ఉదయ్‌భాస్కర్, భార్య: విజయలక్ష్మి